క్లుప్తంగా

ప్రశాంతంగా ముగిసిన శోభాయాత్ర



జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి యాత్రను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్పీ

నెల్లూరు(క్రైమ్) : పటిష్ట బందోబస్తు నడుమ హనుమాన్ శోభాయాత్ర ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఇన్‌చార్జి ఎస్పీ ఏఆర్ దామోదర్ పర్యవేక్షణలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. అడుగడుగునా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, డ్రోన్లను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి ఇన్‌చార్జి ఎస్పీ దామోదర్, ఏఎస్పీ సౌజన్యలు శోభయాత్రను పరిశీలించారు. యాత్ర ప్రశాంతంగా ముగిసేందుకు కృషిచేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని వారు అభినందించారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా శాంతి ర్యాలీ నేడు

- సంఘీభావం తెలిపిన ఆనం విజయకుమార్‌రెడ్డి



ఆనం విజయకుమార్‌రెడ్డితో మైనార్టీ నాయకులు

నెల్లూరు సిటీ : వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం నగరంలో జరుగుతున్న 'భారీ నిరసన ర్యాలీ'కి మైనారిటీ నాయకులతో కలిసి పాల్గొంటానని వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డి అన్నారు. చింతారెడ్డిపాళెంలోని ఆనం విజయకుమార్‌రెడ్డి నివాసంలో మైనార్టీ నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మైనారిటీ అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ సలీం, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు షేక్ సిద్దిక్, రూరల్ మైనారిటీ అధ్యక్షుడు అబ్దుల్ రజాక్, మహమ్మద్ ఇక్బాల్, రసూల్, షబ్బీర్, అలీ, జాకీర్ పాల్గొన్నారు.

గీతామయిలో అన్నదానం



నెల్లూరు సిటీ: నగరంలోని గీతామయి బాలభవన్‌లో అన్నదానాన్ని ఆదివారం నిర్వహించారు. గొడ్డేటి నాగేంద్ర జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు.

వైభవంగా జానకిరాముని గ్రామోత్సవం



ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గ్రామంలో జానకిరాముని గ్రామోత్సవం శనివారం అర్ధరాత్రి వైభవంగా జరిగింది. తొలుత స్వామి, అమ్మవార్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విద్యుద్దీపాలంకరణలతో మేళతాళాల నడుమ ఊరేగించారు. భక్తులు స్వామివారికి పండ్లు, కొబ్బరికాయ కర్పూర హారతులు పట్టి వేడుకున్నారు. ఉభయకర్తలుగా స్థానికులు కేతిరెడ్డి సతీష్‌రెడ్డి- విజయలక్ష్మి దంపతులు వ్యవహరించారు. గ్రామోత్సవం సందర్భంగా వీధులు సందడిగా మారింది.

నేత్రపర్వం సీతారాముల రథోత్సవం



పొదలకూరు: పట్టణంలోని శ్రీరామ మందిరంలో నిర్వహిస్తున్న నవమి వేడుకల్లో భాగంగా రథోత్సవాన్ని నేత్రపర్వంగా ఆదివారం నిర్వహించారు. పట్టణంలో వేడుకగా సాగింది. కర్పూరాన్ని భక్తులు సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. తరుగు ప్రభాకర్, నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

'జూనియర్' ఫలితాల్లో డీలా



యాజమాన్యాల వారీగా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో..

యాజమాన్యం	కళాశాలల సంఖ్య	హాజరైనవారు	ఉత్తీర్ణత సాధించిన వారు	శాతం
ప్రభుత్వ	24	2,283	1,213	53.13
మోడల్ స్కూల్స్	11	840	411	48.92
ఎయిడెడ్	2	165	42	25.45
ఏపీఎస్‌డబ్ల్యూఆర్	6	472	440	93.22
హైస్కూల్ ప్లస్	16	304	144	47.36
కేజీబీవీ	12	294	194	65.98
అన్ ఎయిడెడ్	110	21,914	16,838	76.83

- రాణించలేకపోయిన సర్కార్ విద్యార్థులు
- అధ్యాపకుల కొరత కారణమంటూ విమర్శలు

నెల్లూరు (టౌన్) : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ యాజమాన్యంలో ఉన్న జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం బాగా తగ్గింది. రెగ్యులర్ అధ్యాపకుల కొరత, ఆయా యాజమాన్యాల పర్యవేక్షణ కొరవడటంతో విద్యార్థులు తక్కువ శాతం ఉత్తీర్ణులయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ద్వితీయ సంవత్సరంలో తక్కువ శాతం ఫలితాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా ప్రభుత్వ యాజమాన్యాల్లో పనిచేస్తున్న అధికారులు కళాశాలల ప్రిన్సిపల్స్‌కు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో 50 శాతం ఉత్తీర్ణత దాటడం గగనంగా మారితే ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం ఫర్వాలేదన్న చందంగా నెట్టుకొచ్చారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎయిడెడ్ యాజమాన్య కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం 25.45 శాతం ఉంటే కేజీబీవీల్లో ఉత్తీర్ణత 65.98 శాతం మాత్రమే ఉంది. మొత్తంగా ప్రభుత్వ యాజమాన్య కళాశాలల ఉత్తీర్ణత శాతం 56.08 శాతంగా ఉంది. ప్రైవేటు యాజమాన్యాల్లోని కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం 76.83గా ఉంది. అదే ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో ఎయిడెడ్ యాజమాన్యంలోని కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం 57.83 శాతం ఉంటే, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలల్లో 99.29 శాతంగా ఉంది. అదే ప్రైవేటు యాజమాన్య కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం 88.82 శాతంగా ఉంది.

ద్వితీయ సంవత్సర ఫలితాలు

యాజమాన్యం	కళాశాలల సంఖ్య	హాజరైన విద్యార్థులు	పాసైన విద్యార్థులు	శాతం
ప్రభుత్వ	24	1,796	1,353	75.33
మోడల్ స్కూల్స్	11	606	473	78.05
ఎయిడెడ్	2	166	96	57.83
ఏపీఎస్‌డబ్ల్యూఆర్	6	427	424	99.29
హైస్కూల్ ప్లస్	16	184	150	81.52
కేజీబీవీ	12	168	144	85.71
అన్ ఎయిడెడ్	110	19,373	17,209	88.82

దౌర్జన్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : స్థల యాజమానిపై దౌర్జన్యం చేసిన ఘటనలో నిందితులపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు ఆదిత్యనగర్‌కు చెందిన నిర్మలమ్మకు పడారుపల్లిలో స్థలం ఉంది. ఈనెల 10న ఆమె తన కుమార్తె, కారు డ్రైవర్‌తో కలిసి స్థలాన్ని చదును చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన సుధాకర్ తన వారితో అడ్డుకుని దౌర్జన్యం చేశారు. ఈ మేరకు నిర్మలమ్మ ఆదివారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని మూలాపేట వేణుగోపాలస్వామి రథోత్సవం సందర్భంగా కొండదిబ్బ, అలంకార్ సెంటర్, బ్రాహ్మణవీధి, రాజావారి వీధి, శివాలయం సెంటర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు టౌన్ ఈఈ శ్రీధర్ ఆదివారం తెలిపారు. అలాగే స్టోన్‌హౌస్‌పేటలోని రామాలయ రథోత్సవం సందర్భంగా శివాలయం వీధి, రేబాలవారి వీధి, పప్పులవీధి, తడికల బజార్ సెంటర్, ఎన్టీఆర్ లేఅవుట్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయన్నారు.

వేడుకగా బ్రహ్మోత్సవాలు



శబరి శ్రీరామక్షేత్రంలో కల్యాణోత్సవం



ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి ఆలయంలో..



సంతపేట ఆంజనేయస్వామి ఆలయంలో అశ్వవాహన సేవ

నెల్లూరు(బృందావనం) : నగరంలోని వివిధ ఆలయాల్లో చైత్రమాసం సందర్భంగా బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఈ క్రమంలో ఆదివారం స్వామి, అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులను కటాక్షించారు. పలు ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణాలు నేత్రపర్వంగా సాగాయి.

- మూలాపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రి స్వామివారు గజవాహనోత్సవంలో భక్తులను కటాక్షించారు. ఉభయకర్తలుగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి- ప్రశాంతి దంపతులు వ్యవహరించారు. పాలకమండలి చైర్మన్ చంద్రమౌళిరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.
- సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారు అశ్వవాహన అలంకారోత్సవంలో దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా కంచి మోహన్ రావు, భాస్కర్, కృష్ణ, పి.పార్థసారథి వ్యవహరించారు. ఈఓ రఘురామయ్య, మహేష్ పర్యవేక్షించారు.
- ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని కోదండరామస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. అనంతరం చప్పర ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. సాయిహేమంత్‌కృష్ణచే నిర్వహించిన నాసిక వేణుగానం అలరించింది. ఉభయకర్తలుగా రూపినేని వెంకటేశ్వర్లు- మాధవి దంపతులు వ్యవహరించారు. ఈఓ జి.దర్గయ్య పర్యవేక్షించారు.
- శ్రీరామ్‌నగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో కోదండరామ, ప్రసన్నాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి గజవాహనోత్సవం గావించారు. ఉభయకర్తలుగా పీవీ వీరరాఘవరావు- పావని దంపతులు వ్యవహరించారు.
- బారకాసులోని శ్రీరామమందిరంలో కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా గ్రోసు సుబ్బారావు- సత్యలక్ష్మి, గ్రోసుమురళీకృష్ణ- సరిత దంపతులు వ్యవహరించారు. మందిర కమిటీ అధ్యక్షుడు చాకిరాల శేషయ్య, సభ్యులు చిట్టెంశెట్టి హనుమంతరావు, శిరిగిరి సత్యనారాయణ పర్యవేక్షించారు.



బారకాసులోని శ్రీరామ మందిరంలో..



మూలాపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో..

అంబేడ్కర్, జ్యోతిరావు పూలేకు నివాళి



నెల్లూరు (టౌన్) : స్థానిక దర్గామిట్ట క్రాంతినగర్‌లోని ఎంసీయూపీ స్కూల్లో బీటీఏ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీటీఏ వ్యవస్థాపకుడు రమణయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేడి రమేష్, అసోసియేట్ అధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశం

నెల్లూరు సిటీ : నగరంలోని చింతారెడ్డిపాళెంలో ఉన్న వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి నివాసంలో పార్టీ రూరల్ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతంపై చర్చించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

కార్పొరేటర్‌కు పరామర్శ

నెల్లూరు సిటీ : రూరల్ నియోజకవర్గంలోని కోడూరుపాడు ఒకటో డివిజన్ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డిని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల పరమేశ్వరరెడ్డి కాలకు సర్జరీ జరిగింది. విషయం తెలుసుకున్న విజయకుమార్‌రెడ్డి ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ అధికార ప్రతినిధి శ్రీనివాసరావు, నాయకులు మస్తానయ్య, కృష్ణారెడ్డి, శివయ్య, కరిముల్లా, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరమేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న విజయకుమార్‌రెడ్డి

వాకర్స్‌కు వైద్య పరీక్షలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వాకర్స్‌కు ఆదివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. స్మైల్ వాకర్స్ అసోసియేషన్, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వారి ఆధ్వర్యంలో ఎస్పీటీ స్పెషాలిటీ, ఆర్థోపెటిక్ ఆస్పత్రి వారు సుమారు 200 మంది వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నవాబ్ షరీఫ్, మధులేఖ, స్మైల్ వాకర్స్ అధ్యక్షుడు సయ్యద్‌మదార్, సెక్రటరీ అజ్మీర్‌బాషా, ట్రెజరర్ నారాయణ పాల్గొన్నారు.



స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జున

నెల్లూరురూరల్ : ఏపీ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇసనాకుల మల్లికార్జునను ఆదివారం రాష్ట్ర కమిటీ ఎన్నుకుంది. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ త్వరలో రాష్ట్రస్థాయిలో జిల్లా జర్నలిస్టుల కోసం క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ కమిటీని కూడా త్వరలో నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.



ఘనంగా మట్టల ఆదివారం



బాప్టిస్టు చర్చి డానీహాల్ ఆధ్వర్యంలో గాంధీబొమ్మ సెంటర్ వద్ద ర్యాలీ



బట్వాడిపాళెంలోని చర్చి వద్ద..



మూలాపేట బాప్టిస్టు చర్చి వద్ద..

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పలు చర్చిల్లో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఏసుక్రీస్తును ఆరాదిస్తూ ర్యాలీ చేశారు.

- వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్టు చర్చి డానీహాల్ ఆధ్వర్యంలో సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్ కుమార్ నేతృత్వంలో గాంధీ బొమ్మ వరకు హోసన్న గీతాలను ఆలపిస్తూ సండే స్కూల్ చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కాపరి రెవరెండ్ శ్యాంసన్‌కుమార్, రెవరెండ్ హుల్డా శ్యాంసన్, సండే స్కూల్ టీచర్లు, యువత, సంఘపెద్దలు పాల్గొన్నారు.
- మూలాపేట రామిరెడ్డిపేటలో ఉన్న తెలుగు సెకండ్ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో సంఘ చైర్మన్ ఉరందూరు సురేంద్రబాబు ఆధ్వర్యంలో రామిరెడ్డిపేటలో పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. సంఘ కాపరి శామ్యూల్, కార్యదర్శి ప్రశాంత్‌కుమార్, సండే స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.
- బట్వాడిపాళెంలోని ది సెంటినరి తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో సండే స్కూల్ పిల్లలతో మట్టల ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ హరిపాల్, సంఘ కార్యదర్శి పాల్‌సన్, సండేస్కూల్ పిల్లలు, టీచర్లు పాల్గొన్నారు.
- పొదలకూరు రోడ్డులోని యునైటెడ్ గుడ్‌న్యూస్ బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ రాజశేఖర్‌దాసరి వాక్యోపదేశం చేశారు.



పొదలకూరు రోడ్డులోని చర్చి వద్ద..

పురస్కారాల ప్రదానం

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని ఏసీహాల్లో చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ద్వితీయ అక్షరోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం, సాహిత్య సదస్సు అలరించింది. డాక్టర్ బండారు ప్రసాద్ మూర్తి(హైదరాబాద్)కు ప్రధాన అవార్డును అందజేశారు. అలాగే పి.శ్రీనివాస్‌గౌడ్(హైదరాబాద్)కు సత్యవేటి శ్రీకాంత్ స్మారక అవార్డు, కొమ్మవరపు విల్సన్‌రావుకు తుంగా రాజగోపాలరెడ్డి స్మారక పురస్కారం, మణిబాబు(కాకినాడ)కు నాగభైరవ కోటేశ్వరరావు స్మారక పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో చిన్ని నారాయణరావు, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్, సుభద్రాదేవి, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.



బండారు ప్రసాద్‌మూర్తిని సన్మానిస్తున్న అతిథులు